క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. ఈమేరకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

20న సర్వసభ్య సమావేశం

హన్మకొండ అర్బన్: నగరంలోని రెవెన్యూ కాలనీ ఎస్సార్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పొలాడి రంగారావు, వేముల అనంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి పాలకవర్గం సమావేశం ఒకసారి కూడా జరపలేదని, సొసైటీ పేరున ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతా తీయలేదని, ఫోర్జరీ సంతకాలతో మెంబర్‌షిప్ చేయించడం, భూమి అమ్మిన డబ్బులను బ్యాంక్‌లో జమ చేయకపోవడానికి ఎవరు సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: నగరంలోని సహస్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న సూత్రపు శ్రీనివాస్ పంజాబ్‌లోని లవ్లీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'ఎక్స్‌ట్రాక్షన్, నార్మకాలజికల్ అండ్ ఫార్మా కోఇన్ఫర్మాటిక్ ఎవల్యూషన్ ఆఫ్ పొటెన్షియల్ యాంటీ డయాబెటిక్ ఏజెంట్స్' అనే అంశంపై ప్రొఫెసర్ రష్మ సక్సెనాపాల్, డాక్టర్ పిల్లి గోవిందయ్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించింది.

ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్‌కు అభినందన




కేయూ క్యాంపస్: కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరానికి హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి, ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్ యాకూబ్ పాల్గొన్నాడు. ఈ మేరకు ఆయనను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు కనకయ్య, శ్రీదేవి గురువారం అభినందించారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం



హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలోని హోటళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అనాథ వృద్ధుడిని ఓ బీఆర్ఎస్ నేత ఆదుకున్నాడు. ఈమేరకు హసన్‌పర్తికి చెందిన వృద్ధుడు వీరభద్రయ్య పరిస్థితిని చాతళ్ల వేణుగోపాల్ గమనించి భీమారంలోని లార్డ్ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులకు సమాచారం అందించి అనాథాశ్రమంలో గురువారం చేర్పించారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఖిలా వరంగల్: మైసూర్‌లోని ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థస్వామిని వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2నుంచి 4వ తేదీ వరకు సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరగనున్న కుంభాభిషేక మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను స్వామిజీకి అందజేశారు. కార్యక్రమంలో రావికంటి అశోక్, ఆడెపు శ్యాంకుమార్, కొండి రాజమౌళి, యాదగిరి, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేష్ పాల్గొన్నారు.

బార్, రెస్టారెంట్ కమిటీ ఎన్నిక

హన్మకొండ అర్బన్: హనుమకొండ బార్ అండ్ రెస్టారెంట్ జిల్లా అసోసియేషన్ సమావేశం సుబేదారిలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్ధం రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవీందర్, కోశాధికారిగా కృష్ణాకర్, సంయుక్త కార్యదర్శిగా దీరజ్ రెడ్డి, సభ్యులుగా కేశవరావు, నవీన్‌రావు, సాయిని రమణ, వెంకటేశ్వర్, మోహన్‌రావు, విజయ్‌ను ఎన్నుకున్నారు.

ఆయాలకు బెనిఫిట్స్ ఇవ్వాలి

ఖిలా వరంగల్: రిటైర్మెంటైన అంగన్‌వాడీ ఆయాలకు ప్రభుత్వం ప్రకటించిన సర్వీస్ బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని శివనగర్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా ఇడబోయిన రాజమ్మ కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని 90వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆమె గురువారం మాట్లాడారు. తాను ఆయాగా 30 ఏళ్లు సర్వీస్ చేసి 2024, మార్చిలో రిటైర్మెంట్ అయ్యానని, రిటైర్మెంట్ సమయంలో రూ.లక్ష వరకు సర్వీస్ బెనిఫిట్స్ అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఏడాది గడిచినా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రాజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రివేళల్లో గుట్టలు గుల్ల

- బుచ్చయ్యపల్లి కేంద్రంగా మొరం దందా
- అధికారులతో కలిసి దర్జాగా ఓ నాయకుడి అక్రమ వ్యాపారం
- స్థానికులు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు



మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



డంప్ చేసిన మొరం కుప్పలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బుచ్చయ్యపల్లి కేంద్రంగా మొరం దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లితోంది. రాత్రివేళ ఈ వ్యాపారానికి అక్రమార్కులు తెరలేపారు.

రాత్రివేళల్లో వ్యాపారం

హసన్‌పర్తి మండలం బుచ్చయ్యపల్లికి చెందిన ఓ ముఖ్యనాయకుడు అక్రమ మొరం వ్యాపారం చేస్తున్నాడు. రాత్రివేళ పక్కనే ఉన్న గుట్టల నుంచి భారీగా మొరం తవ్వుతూ అక్కడి నుంచి బుచ్చయ్యపల్లిలోని ఓ ఖాళీ ప్రదేశంలో డంప్ చేస్తున్నాడు. మర్నాడు రాత్రి ఆ మొరాన్ని టిప్పర్లు ద్వారా నగరానికి ఆ నాయకుడు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నా దృష్టికి రాలేదు

మొరం అక్రమ వ్యాపారం విషయం నా దృష్టికి రాలేదు. విచారణ చేసి నిందితులపై తగు చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

- చల్లా ప్రసాద్, తహసీల్దార్

టిప్పర్ మొరానికి రూ.10 వేలు

ప్రతిరోజూ లక్షల రూపాయల విలువగల మొరం వ్యాపారం సాగుతోందని స్థానికులు అంటున్నారు. ఒక టిప్పర్ మొరాన్ని రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. రాత్రివేళ టిప్పర్ల శబ్దాలతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

మొరం తవ్వకాలకు అనుమతి తప్పనిసరి ఉండాలి. దరఖాస్తు చేసుకుంటే అధికారులు అనుమతి ఇస్తారు. అందుకోసం కొంత మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమా చేయాల్సి ఉంటుంది. ఆ వ్యాపారి సంబంధిత అధికారులను మిలాఖత్ చేసుకుని దందా చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కేడీసీలో ముందస్తు ఉగాది వేడుకలు



కేడీసీలో ఉగాది వేడుకలకు సంప్రదాయ దుస్తులతో హాజరైన అధ్యాపకులు

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలను గురువారం నిర్వహించారు. కళాశాలలో తెలుగు, బాటనీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వంటకాలతో ఫెడ్ ఫెస్టివల్ నిర్వహించారు. అలాగే, ఆయా విభాగాల అధ్యాపకులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, స్టాఫ్ సెక్రటరీ రవికుమార్, తెలుగు విభాగం అధిపతి సత్యనారాయణ, బాటనీ విభాగం అధిపతి కోమల, అధ్యాపకులు మమత, సాయిలు, రమేష్, శ్రీనివాస్, మహేందర్, సీతారాం, శ్యాంప్రసాద్, సమ్మయ్య, యుగేందర్, నరేందర్, మన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 13 మంది రౌడీ షీటర్లలో ఒకరు మృతి చెందగా, మిగిలిన వారిని పిలిపించి వారి గత రికార్డును పరిశీలించారు. ప్రస్తుతం చేస్తున్న కార్యకలపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని అన్నారు. క్రిమినల్ కేసుల్లో తలదూర్చితే పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ప్రిన్సిపాల్, తదితరులు

కేయూ క్యాంపస్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్, మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుశ్రీ, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్, ఆర్ట్స్ కళాశాల ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి సుశీల్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి రథోత్సవం



రామన్నపేట: మట్టెవాడలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పురవీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఇరుకుల్ల రమేష్, కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, తోట నవీన్‌కుమార్, బెజుగం రజినీకాంత్, పనేష్, దివ్వెల శ్రీనివాస్, నీల రాజన్న, నాగరాజు, సత్యనారాయణ, సర్వేశ్వర్‌రావు, ఎలగందుల రమేష్, పసునూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల' దుండగులను అరెస్ట్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: ఈ నెల 20వ తేదీన ఖిలా వరంగల్ పడమర కోట, మట్టికోట తలుపుల బావి వద్ద స్థానిక పాస్టర్ దుగ్గిరాల కుమారి, భర్త దుగ్గిరాల లక్ష్మణ్‌కు చెందిన గొర్రెల షెడ్డులోని 350 గొర్రెలను సజీవ దహనం చేసిన దుండగులను గుర్తించి అరెస్ట్ చేయాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ సత్యశారదాకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ గతంలో షెడ్డు నుంచి గొర్రెలను దొంగిలించుకు పోయారని మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతోనే మరోసారి ఈ దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.50 లక్షల వరకు బాధితులకు నష్టం వాటిల్లిందని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల శ్రీనాథ్, ఠాగూర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు తోఫాల పంపిణీ



వరంగల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు సహకారంతో డివిజన్‌లోని మసీదుల మోజుసాబ్, మౌజాన్‌లకు తోఫాలను అందజేసినట్లు 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి తెలిపారు. డివిజన్‌లోని నాలుగు మసీదులలోని 9మందికి రంజాన్ తోఫాలను గురువారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న రజనీకర్ రెడ్డి

నయీంనగర్: తాము 1984లో కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈక్రమంలో కబ్జాదారుల నుంచి తమ భూమిని కాపాడి న్యాయం చేయాలని భూ బాధితులు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో భూ బాధితుడు చిట్టిరెడ్డి రజనీకర్ రెడ్డి మాట్లాడుతూ తాము దుగ్గంపూడి జోజిరెడ్డి వద్ద నుంచి 30 మంది కలిసి కుమార్‌పల్లి శివారులో సర్వేనంబర్లు 126, 117లలో ఎకరం మూడు గుంటల భూమి కొనుగోలు చేశామని తెలిపారు. 2017 నుంచి కాస్తులో ఉంటున్నామని వివరించారు. 2017లో ఆ భూమిపై రంజిత్‌రెడ్డి మనుషులు కన్నేసి తమపై దాడి చేశారని వాపోయారు. దాంతో గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. తమ భూమి తమకు అప్పగించాలని బాధితులు విజయ, శ్రీలత, కొండయ్య, అనంతలక్ష్మి, మహేందర్, ధనలక్ష్మి, తనీషా, సురేష్, గణేష్, మాధవరెడ్డి, మధుసూదన్ కోరారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రామారావు

కాజీపేట అర్బన్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రామారావు సూచించారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ అడ్డాలో ట్రాఫిక్ నియంత్రణపై డ్రైవర్లకు ఎస్సై రామారావు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, యూనియన్ నాయకుడు వేల్పుల సాంబమూర్తి, కోశాధికారి సురేష్, గుండు సత్యనారాయణ, లక్ష్మణ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనివార్యం



కామేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వరంగల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని, సమాజ సేవకు పదవీ విరమణ అడ్డంకి కాదని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. కాశిబుగ్గలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు గుండు కామేశ్వర్ ఆత్మీయ అభినందన సభను పోపా ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు గుండు కామేశ్వర్, భాగ్యలక్ష్మి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, గోరంటల రాజు, బత్తుల సత్యం, చందర్, గోషికుండ సుధాకర్, పాము శ్రీనివాస్, మాటేటి అశోక్, ధర్మపురి గోవిందు, పెద్దూరి పెద్దన్న, బైరి శ్యాంసుందర్, వంగరి వేణుగోపాల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అసెంబ్లీలో డంపింగ్ యార్డు ప్రస్తావనపై హర్షం



మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ - రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని అసెంబ్లీలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్పన్ నాగరాజు ప్రస్తావించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ ఎమ్మెల్యేల చిత్రపటాలకు నాయకుడు వస్కుల శంకర్ ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వీలైనంత తొందరగా డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, గుర్రం జ్యోతి, అమర్‌నాథ్, పల్లపు అర్జున్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, నీలం రజినీ వేణుయాదవ్, వినయ్, భిక్షపతి, దువ్వ విజయ్, గడ్స్ రాజు, వస్కుల శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోర్‌బోలి భాషపై శాసన సభలో తీర్మానం హర్షణీయం

హన్మకొండ: లంబాడీల మాతృభాష గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ బంజారా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ జి.వీరన్న నాయక్, అధ్యక్షుడు జి.సజ్జన్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎల్.దాస్యానాయక్, నాయకుడు భూక్య మోతీలాల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. తాము గతంలో రాష్ట్ర గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రం ఇచ్చామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజారాలు, లంబాడీలు వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాల్లో ఒకే విధానాన్ని ఆచరిస్తూ గోర్‌బోలి భాషను తమ మాతృభాషగా ఆచరిస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 12 కోట్ల మంది, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది గోర్‌బోలి భాష మాట్లాడగలరని పేర్కొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు



నయీంనగర్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంటే, దాన్ని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అనుచరులు ఎమ్మెల్యే నాయినిపై ఆరోపణలు చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పశ్చిమ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో భూకబ్జాలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే భూ కబ్జాలకు చరమగీతం పడే విధంగా ఎమ్మెల్యే నాయిని చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తడక సుమన్ శ్రీకాంత్, సారంగం, రమేష్, దీపక్ రెడ్డి, సతీష్, కొటిల్ రెడ్డి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం పదవులు కేటాయించాలి

హన్మకొండ: రాష్ట్రంలో త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 45 శాతం పదవులు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మంత్రివర్గ విస్తరణలో కూడా 42 శాతం వర్తింపజేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీలు 56 శాతం ఉంటే.. బీసీలకు గత మంత్రివర్గ విస్తరణలో ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించి, 5 శాతం ఉన్న రెడ్లకు మాత్రం నలుగురికి అవకాశం కల్పించారన్నారు.

'చలో ఢిల్లీ'కి బయల్దేరిన కార్మికులు

ఖిలా వరంగల్: ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఉదయం వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి ఢిల్లీకి భవన నిర్మాణ కార్మికులు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, కడారి రాములు, రాంబాబు రాజయ్య, పోచమ్మ, సౌందర్య, సంకీర్తన, రామక్క, రాజేశ్వరి పాల్గొన్నారు.

కిట్స్‌లో మోడల్ యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రాం

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మోడల్ యునైటెడ్ 7.0 కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ కళాశాలల నుంచి 260 మంది విద్యార్థులు పాల్గొని ఐక్యరాజ్య సమితిలో జరిగే సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ ప్రభాకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ వర్సిటీ వీసీకి అభినందనలు

ఎంజీఎం: కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పీవీ.నంద కుమార్‌రెడ్డిని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (టీ - జూడా) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్, కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) జూడా ఉపాధ్యక్షుడు అశ్విని నవదీప్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీకి అభినందనలు తెలిపారు.

ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

వరంగల్ చౌరస్తా: ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపక నేత, దివంగత మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు మే 12నుంచి 2026, మే 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పెద్దారపు రమేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఓంకార్ ముఖ్య భూమిక పోషించారని కొనియాడారు. అలాగే, అసెంబ్లీ టైగర్‌గా పేరు గడించారని పేర్కొన్నారు. 1926, మే 12వ తేదీన సూర్యాపేట జిల్లా ఏపూరు గ్రామంలో ఓంకార్ జన్మించి వందేళ్లు పూర్తి కావస్తోందని గుర్తుచేశారు. ఉత్సవాల నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వల్లెపు ఉపేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా గోనె కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా పెద్దారపు రమేష్, కోశాధికారిగా మంద రవి, ప్రతినిధులుగా ఎన్‌రెడ్డి హంసారెడ్డి, గుండెబోయిన చంద్రయ్య, కన్నం వెంకన్న, కుసుంబ బాబురావు, నీల రవీందర్, గడ్డం నాగార్జున, కొమరయ్య, వంగల రాగసుధ వ్యవహరిస్తారని రవి వివరించారు.

పోరుగర్జనను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కేయూ క్యాంపస్: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న బీసీల పోరుగర్జనను విజయవంతం చేయాలని గౌడ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద పోరుగర్జన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రీసెర్చ్ స్కాలర్లు రేగుల నరేష్, నామాల రవిస్వామి, బీసీ విద్యార్థి సంఘం మహిళా కన్వీనర్ జాహ్నవి, బాధ్యులు అజయ్‌సింగ్, గణేష్, శ్రీసాయి, వినోద్, అన్వేష్, అఖిల్, ప్రీతి, అపూర్వ, రక్షిత, నిఖిత, హరిప్రియ, అశ్విత, తనుశ్రీ పాల్గొన్నారు.

పాఠశాలలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా ప్రాంత, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహార పదార్థాలు, సాంస్కృతిక విషయాలు, నృత్యాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అలాగే, నృత్యాలు, నాటిక, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఉమ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాలు, సంప్రదాయలు, చారిత్రక విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రోగ్రాం కన్వీనర్, ఉపాధ్యాయుడు సీహెచ్.రాములు మాట్లాడుతూ బహుభాషలు నేర్చుకుంటే విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, రమ, నరేందర్, రాములు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, చాంబర్ ప్రతినిధులు

వరంగల్: పెరుగుతున్న ఎండల దృష్ట్యా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధుల అభ్యర్థన మేరకు రైతులు, గుమాస్తాలు, కార్మికులు, వ్యాపారస్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. మార్కెట్‌లోని మిర్చి యార్డు వద్ద చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డితో కలిసి మజ్జిగ ప్యాకెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి మే నెల చివరి వరకు రోజూ 4వేల వరకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శులు రాము, అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, గుమాస్తా సంఘం అధ్యక్షుడు ఎనుముల మల్లేశం, కార్యవర్గ సభ్యులు, హమాలీ కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పెనాల్టీలను రద్దు చేయాలి



మేయర్‌కు పూల మొక్క అందిస్తున్న బాధ్యులు

హన్మకొండ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలో సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో జరిగిన తప్పుల వల్ల కొన్ని అపార్ట్‌మెంట్లలో ఉన్న ప్లాట్ల ఓనర్లు పెనాల్టీ కట్టాల్సిన వస్తోందని, దీన్ని రద్దు చేయాలని ట్రై సిటీస్ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం సభ్యులతో కలిసి మేయర్ గుండు సుధారాణిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజేశ్వర్‌రావు, ఆనందం, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.